స్టెనోగ్రాఫర్ పరీక్ష ప్రశాంతం

మహబూబాబాద్ రూరల్, జనవరి 18 : పట్టణంలో శనివారం స్టెనోగ్రాఫర్, రికార్డ్ అసిస్టెంట్ పరీక్షలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రశాంతంగా జరిగాయి. స్టెనోగ్రాఫర్ పరీక్షకు 25 మంది అభ్యర్థులకుగాను 20, రికార్డ్ అసిస్టెంట్ పరీక్షకు 120 మందికిగాను 102 హాజరైనట్లు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సురేష్ తెలిపారు.

నవోదయ పరీక్ష..

జిల్లాలో శనివారం నవోదయ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, మరిపెడలో సెయింట్ అగస్టీన్, ఆదర్శ పాఠశాల, గూడూరులోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల నిర్వహించినట్లు వివరించారు. 1,118 మంది విద్యార్థులకు 882 మంది హాజరై, 236 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

సరస్వతిదేవి విగ్రహం చేయి ధ్వంసం

సరస్వతిదేవి విగ్రహం చేయి ధ్వంసంపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. మండలంలోని జమాండ్లపల్లి హైస్కూల్ ఆవరణలోని సరస్వతిదేవి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని హెచ్ఎం సమ్మెట వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపారు.

మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ స్టడీ సర్కిల్ హైదరాబాద్ వారు గ్రూప్స్-1, 2, 3, స్టాఫ్ సెలక్షన్, బ్యాంక్ ఉద్యోగాలు, వివిధ పోటీ పరీక్షలకు నాలుగు నెలల పాటుగా బేసిక్ ఫౌండేషన్ కోర్స్ జిల్లాలో ఉన్న మైనార్టీస్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన మైనార్టీ అభ్యర్థులు ఫిబ్రవరి 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 95737 69507 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ రూరల్: షెడ్యూల్డ్ తెగల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు సహాయ పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరానికి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ ఎన్జీవోస్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధిశాఖ అధికారి దేశీరాం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కోసం పనిచేస్తున్న వారు ఫిబ్రవరి 15 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

సర్వే అధికారులకు నిరసన సెగ

- కొత్త రేషన్‌కార్డు దరఖాస్తుదారుల్లో కొందరే ఎంపిక
- అర్హులందరి పేర్లు జాబితాలో లేకపోవడంపై ప్రజల ఆగ్రహం
- అధికారులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

పెద్దముప్పారంలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

దంతాలపల్లి/చిన్నగూడూరు, జనవరి 18: కొత్త రేషన్‌కార్డుల సర్వేకు వచ్చిన అధికారులకు గ్రామాల్లో నిరసన సెగ తగులుతోంది. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారందరినీ కాకుండా కొందరి ఇళ్లకు వెళ్లి సర్వే చేయడంపై నిలదీస్తున్నారు. దంతాలపల్లి మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా, రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరితోకాకుండా 761 మందితో మాత్రమే జాబితా వచ్చింది. దాని ఆధారంగా అధికారులు గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. మండలంలోని పెద్దముప్పారంలో తహసీల్దార్ చంద్రరాజేశ్వర్, ఎంపీడీవో వివేక్ రాంను అర్హులకు రేషన్‌కార్డులు ఇచ్చేవరకు సర్వే చేయొద్దని ప్రజలు శనివారం అడ్డుకున్నారు. రెండో విడతలో వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చి సర్వే మొదలు పెట్టారు. చిన్నగూడూరు మండలం మేఘ్యాతండా వాసులు సురేష్, నరేందర్, చిరంజీవి శనివారం రేషన్‌కార్డుల విషయమై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలని వారు కోరారు. ప్రజాపాలన కార్యక్రమంలో తండాలో 60 మంది దరఖాస్తు చేసుకోగా 14మందికి మాత్రమే మంజూరైనట్లు అధికారులు చెబుతున్నారని రఘు, పవన్, నరేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమావేశంలోమాట్లాడుతున్న బడే నాగజ్యోతి

'స్థానిక' ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాలి

బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి

కొత్తగూడ, జనవరి 18: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేసి మండలంలో ఎక్కువ స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి అన్నారు. మండలంలోని గాంధీనగర్‌లో కొత్తగూడ, గంగారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు మండలాల్లో కొత్త గ్రామపంచాయతీలు ఏర్పడుతున్నాయని, కార్యకర్తలు అందరినీ కలుపుకొని సర్పంచ్‌లను గెలిపించుకోవాలన్నారు. కార్యకర్తలు ఎవరూ కూడా పార్టీ మారొద్దని, సర్పంచ్ ఎన్నికల్లో నిలిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. బడే నాగజ్యోతిని తాటివారిపేంపల్లి గ్రామపంచాయతీ బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.

21 నుంచి ప్రభుత్వ పథకాలపై గ్రామసభలు

తొర్రూరు, జనవరి 18: అర్హులకే సంక్షేమ పథకాలు అందించాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ అన్నారు. శనివారం తొర్రూరు మున్సిపాలిటీలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలపై ఆఫీసర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈనెల 21 నుంచి 24 వరకు వార్డు సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 21న 1, 5, 9, 13వార్డుల్లో, 22న 14, 2, 6, 10 వార్డుల్లో, 23న 3, 7, 11, 15 వార్డుల్లో, 24న 4, 8, 12, 16 వార్డుల్లో సభలు ఉంటాయని వివరించారు. మేనేజర్ కట్టా స్వామి, ఆర్ఐ రాజయ్య, హెల్త్ అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

స్వాధీనం చేసుకున్న, గుడుంబా బెల్లం పానకాన్ని చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు

కేసముద్రం, జనవరి 18: మండలంలోని అమీనాపురం, బ్రహ్మంగారిగుడి, గిర్నితండా, ఎన్‌టీఆర్ నగర్‌లో గుడూరు ఎక్సైజ్ సీఐ భిక్షపతి ఆధ్వర్యంలో శనివారం గుడుంబా స్థావరాలపై దాడులు చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి 12లీటర్ల నాటుసారా, 200లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేశారు. ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వరి, కానిస్టేబుళ్లు బొబ్బల నరేష్, సుధాకర్, గద్దర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

మాట్లాడుతున్న రూరల్ ఎస్సై దీపికారెడ్డి

మహబూబాబాద్ రూరల్, జనవరి 18 : రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని రూరల్ ఎస్సై దీపికారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సంద్రాళ్లగూడెం గ్రామ పంచాయతీ ప్రజలకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేసి, సైబర్ మోసగాళ్ల వలలో పడి మోసపోవద్దన్నారు. రోడ్డుపై ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలన్నారు. పోలీస్ హెడ్ కానిస్టేబుల్ వెంకన్న, సెక్రటరీ మహేశ్, మాజీ సర్పంచ్ లక్ష్మమ్మ పాల్గొన్నారు.

పీవోడబ్ల్యూ సభను విజయవంతం చేయాలి

కొత్తగూడ, జనవరి 18: ఈనెల 24న మంచిర్యాలలో నిర్వహించే ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) ఐక్య సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకురాలు తోలెం నిర్మల అన్నారు. మండలంలోని న్యూడెమోక్రసీ కామ్రేడ్ పాలడుగు కృష్ణ స్మారక భవనంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం, మహిళలపై వేదింపులు, అశ్లీల అసభ్య సంస్కృతి, వరకట్న వేధింపులు, లైంగిక దాడులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నట్లు తెలిపారు. ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాళ్లు రమ, లక్ష్మి, స్వప్న, సంధ్య, మల్లమ్మ, సరోజన పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థికసాయం అందజేస్తున్న రామచంద్రు

నెల్లికుదురు, జనవరి 18: మండల కేంద్రానికి చెందిన వడ్ల రమేశ్ భార్య అరుణ ఇటీవల మృతిచెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో మండల కేంద్రానికి చెందిన పులి రామచంద్రు శనివారం రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. పోతుగంటి శ్రీనివాస్, గొట్టిముక్కల ఆదిరెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకుడు శ్రీనివాస్

కబ్జాదారుల నుంచి భూములు కాపాడాలి

గార్ల, జనవరి 18 : మండలంలోని సీతంపేట సమీపంలో పెద్ద చెరువు శిఖం భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని అఖిలపక్ష నాయకుడు కందునూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలం కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో అఖిలపక్ష, ఆయకట్టు రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దాదాపు 490 ఎకరాల చెరువు శిఖం భూములు ఉండగా, సుమారుగా 130 ఎకరాలు కబ్జా అయ్యాయని, గతంలో సర్వే చేసి ట్రెంచ్ కొట్టినప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో మళ్లీ ఆక్రమణకు గురయ్యాయని పేర్కొన్నారు. రాజారావు, సత్యవతి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

హామీలను అమలు చేయాలి

చిన్నగూడూరు, జనవరి 18: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు పయ్యావుల మల్లయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను వెటర్నరీ వైద్యుడు రామచంద్రుతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గొల్ల కురుమలకు ప్రభుత్వం గొర్రెల కొనుగోలుకు రూ.2లక్షల నగదు బదిలీ చేస్తామన్న హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. చిత్తారి సోమన్న, లింగమూర్తి, వెంకన్న, మల్లయ్య, వీరన్న, సురేష్, రామ్మూర్తి, శంకర్, లక్ష్మినర్సు, లింగన్న ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు ఇవ్వాలి

మాట్లాడుతున్న మార్తినేని పాపారావు

ఇనుగుర్తి, జనవరి 18: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మార్తినేని పాపారావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆ పార్టీ గ్రామ కార్యదర్శి ఆవుల వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు అందించాలని డిమాండ్ చేశారు. కావటి నర్సయ్య, బండి సత్యం, తోట యాకమ్మ, ఆవుల ఉప్పలయ్య, జెన్నయ్య, వెంకటమ్మ పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. వృద్ధుడి మృతి

మైనర్, తండ్రిపై కేసు నమోదు

నర్సయ్య (ఫైల్)

తొర్రూరు, జనవరి 18: అతివేగంగా, నిర్లక్ష్యంగా బైక్ నడిపి వృద్ధుడి మృతికి కారణమైన పదహారేళ్ల మైనర్‌తోపాటు తండ్రిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లికుదురు మండలం నైనాల గ్రామానికి చెందిన పదహారేళ్ల బాలుడు శుక్రవారం సాయంత్రం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వైపు బైక్‌పై వెళ్తూ ఆశ్వినీ థియేటర్ సమీపంలో స్కూటీపై వస్తున్న తొర్రూరు పట్టణానికి చెందిన రేవూరి నర్సయ్య(74)ను వేగంగా ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన నర్సయ్యను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మైనర్‌కు వాహనం ఇచ్చి ప్రమాదానికి కారణమైన తండ్రి నారబోయిన వెంకన్నపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరి..

మరిపెడ, జనవరి 18: బైక్ అదుపుతప్పి కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి మండలంలోని ఎల్లంపేటలో జరిగింది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అనిల్‌కుమార్ జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మరిపెడ నుంచి చిన్న గూడూరుకు బైక్‌పై ముగ్గురు వెళ్తుండగా ఎల్లంపేటలో మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడి మృతిచెందాడు. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. 108లో ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

డోర్నకల్, జనవరి 18: మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సీరోలు మండలం మోదుగుగడ్డ తండాలో శనివారం జరిగింది. సీఐ భూక్యా రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మోదుగుగడ్డ తండాకు చెందిన బానోత్ నరేశ్(30)కు ఎనిమిదేళ్ల క్రితం నాగమణితో వివాహమైంది.ఇద్దరు కుమారులు ఉన్నారు. నాగమణి ప్రవర్తన సరిగా లేదని మనస్తాపంతో ఈనెల 16న గడ్డిమందు తాగాడు. ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కురవి: గుజిలితండా పాఠశాలను పునఃప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

డోర్నకల్/ మరిపెడ/కురవి, జనవరి 18: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ శనివారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. డోర్నకల్ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్‌కు శంకుస్థాపన చేశారు. డోర్నకల్‌లో 35 మంది, మరిపెడ ఇండోర్ స్టేడియంలో 90మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని తెలిపారు. డోర్నకల్ తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, డీటీ వీరన్న, మున్సిపల్ వైస్‌చైర్మన్ కేశబోయిన కోటిలింగం పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వ విప్ మధ్యాహ్నం 3గంటలకు వస్తున్నట్లు అధికారులు చెప్పగా అంతకుముందే చేరుకున్న లబ్ధిదారులు చాలాసేపు ఎదురుచూశారు. ఆయన ఆలస్యంగా తీరా సాయంత్రం 5గంటలకు వచ్చారు. మరిపెడలో తహసీల్దార్ సైదులు, ఆర్ఐ శరత్‌చంద్రగౌడ్ పాల్గొన్నారు. కాగా, కురవి మండలం బలపాలలో రూ.కోటీ 43లక్షలతో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన పీహెచ్‌సీ, పంచాయతీ, గ్రంథాలయ భవనాలను ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ ప్రారంభించారు. సీరోలు మండల కేంద్రంలో పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. డాక్టర్ మాధవరావు, బలపాల పీహెచ్‌సీ డాక్టర్ ప్రవంతిని సన్మానించారు. డీఎంహెచ్‌వో మురళీధర్, ఈఈ విద్యాసాగర్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు మాలోత్ నెహ్రూనాయక్, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ పాల్గొన్నారు.

గుజిలితండాలో పాఠశాల పునఃప్రారంభం

కురవి(సీరోలు): సీరోలు మండలం కొత్తూరు(సీ) శివారు గుజిలితండా ప్రాథమిక పాఠశాలను శనివారం ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్ పునఃప్రారంభించారు. విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు తల్లిదండ్రులు తమ పిల్లలను పంపాలన్నారు. డీఈవో రవీందర్‌రెడ్డి, సీరోలు, కురవి ఎంఈవోలు లచ్చిరాం, బాలాజీ, కాంప్లెక్స్ హెచ్ఎం శంకర్‌నాయక్, మందుల శ్రీరాములు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు గ్రామ కమిటీలు ఎన్నిక

ఎన్నికైన మున్నూరుకాపు సంఘం నూతన కమిటీ

ఇనుగుర్తి, జనవరి 18: ఇనుగుర్తి, అయ్యగారిపల్లి గ్రామాల మున్నూరుకాపు సంఘం కమిటీలను శనివారం మండల కేంద్రంలో సంఘం గౌరవ సలహాదారు మామిడి శోభన్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఇనుగుర్తి కమిటీ గౌరవ అధ్యక్షుడిగా వద్దిరాజు కిషన్, అధ్యక్షుడిగా కొణతం నరేందర్, ఉపాధ్యక్షులుగా పింగిలి వీరన్న, కొంతం వెంకన్న, ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకన్న, సహాయ కార్యదర్శులుగా శ్రీరాంచందర్, కందాల రంగయ్య, కోశాధికారిగా కావటి రవి, గౌరవ సలహాదారు జడల నాగేశ్వర్, కావటి నర్సయ్య, అల్లపు రాములు, కుళ్ల రాజయ్య, యూత్ అధ్యక్షులుగా బండి ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. అయ్యగారిపల్లి గ్రామ అధ్యక్షుడిగా మలిశెట్టి రవి, ఉపాధ్యక్షుడు బోళ్ల కృష్ణ, మెట్టు రాజు, ప్రధాన కార్యదర్శి చీకటి స్టాలిన్, సహాయ కార్యదర్శి మామిడి కిరణ్, కోశాధికారి మటిశెట్టి శోభన్, గౌరవ అధ్యక్షుడిగా మామిడి శోభన్, మద్ది కుంట్ల వెంకన్న, మలిశెట్టి శ్యామ్, మామిడి జనార్ధన్ ఎన్నికయ్యారు.

కొత్త టీచర్ల అవగాహన సదస్సును జయప్రదం చేయాలి

కురవి: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్/ కురవి/ నర్సింహులపేట/ నెల్లికుదురు, జనవరి 18 : డీఎస్సీ-2024లో నియామకమైన ఉపాధ్యాయులకు టీపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియం అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆ సంఘం నాయకులు పలుచోట్ల కరపత్రాలను ఆవిష్కరించారు. మహబూబాబాద్ పట్టణం, కురవి మండలం మోద్గులగూడెం జడ్పీ హైస్కూల్‌లో కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేశ్ మాట్లాడారు. ఉపాధ్యాయ ఉద్యమ చరిత్ర సమకాలీన కర్తవ్యాలు, వృత్తినిబద్ధత పాఠశాలల పరిరక్షణ అనే అంశంపై ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు ఈ నరసింహారెడ్డి ప్రసంగిస్తారని, వృత్తి నిబద్ధత పాఠశాలల పరిరక్షణ అనే అంశంపై టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాసులు ప్రసగిస్తారని తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భిక్షపతి, శ్రీనివాస్, మల్లికార్జున్, నిర్మల, ఫాతిమ, కురవిలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు గుండ్ల విజయ్ కుమార్, మోద్గులగూడెం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం సత్యనారాయణచారి, తోట శ్రీరాములు, సలీం, దీపిక, రమేశ్, విష్ణు, ఇందిర, భాగ్యలక్ష్మి, లక్ష్మి, దార్ల సునీల్, శ్రీనివాస్, కావ్య, రజిత, అనిత పాల్గొన్నారు. నర్సింహులపేటలో టీపీటీఎఫ్ మండల కార్యదర్శి ఏ శ్రీనివాస్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, యాకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు. నెల్లికుదురు ఎమ్మార్సీ ఆవరణలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు యాకయ్య కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. సంఘం జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌ప్రవీణ్, సంపత్‌రెడ్డి, మధుసూదన్, కరుణాకర్, శ్రీనివాస్, ఉమారాషి, ఉషారాణి పాల్గొన్నారు.

'అంబేద్కర్ సహాయ నిధి'ని అమలు చేయాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 18 : రాష్ట్ర ప్రభుత్వం దళిత కుటుంబాలను ఆదుకునేందుకు అంబేద్కర్ సహాయ నిధి పథకాన్ని అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని కేటీఆర్ నగర్ కాలనీలో శనివారం సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కాలయాపన చేయకుండా ఏకసభ్య కమిషన్ నివేదిక ఆధారంగా వెంటనే ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరారు. చెప్పులు కుట్టే వృత్తిదారులకు ఉపాధి లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకోవాలన్నారు. పులి శ్రీను, రాధ, జయరాజు, సందీప్, రవి, అరుణ, మాధవి పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్

మహబూబాబాద్ రూరల్, జనవరి 18 : తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు ఈనెల 21న పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం గ్రౌండ్‌లో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి జ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, చెస్, క్యారమ్స్, హాకీ, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడల్లో పాల్గొనవచ్చని వివరించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 9440630681 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 18 : వాహనదారులు నిబంధనలు పాటించాలని ఎస్సీ సుధీర్ రాంనాథ్ కేకన్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ప్రజలు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, వాహనాలు అతివేగంగా నడిపి ప్రమాదాల బారిన పడొద్దని, 18ఏళ్లు నిండిన తర్వాత లైసెన్స్ పొందిన తర్వాతే వాహనాలు నడపాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచనలు చేశారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజల చైతన్యానికి కళానాట్య మండలి కృషి

మహబూబాబాద్ రూరల్, జనవరి 18 : ప్రజలను చైతన్యం చేయటంలో ప్రజా కళా నాట్య మండలి కృషి చేస్తోందని జిల్లా కార్యదర్శి నక్క సైదులు అన్నారు. శనివారం పట్టణంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలపై, పెరుగుతున్న మూఢనమ్మకాలపై పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలన్నారు. రామకృష్ణ, నాగేంద్ర, పవన్, ఉప్పలయ్య, జహీర్, మల్లేశ్, నరేందర్, స్వామి పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 18 : అర్హులందరికీ రేషన్‌కార్డులు జారీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సూర్ణపు సోమయ్య అన్నారు. శనివారం పట్టణంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. రేషన్ కార్డ్ కోసం అప్లై చేయనివారు చాలామంది ఉన్నారని, వారికి మళ్లీ అవకాశం కల్పించాలని కోరారు. రాజ మౌళి, సీతారాం, రావుల రాజు, నాగన్న, సైదులు, వెంకన్న పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సింధూర రవి

మరిపెడ, జనవరి 18: మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని చైర్‌పర్సన్ సింధూర రవి అన్నారు. శనివారం ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో కమిషనర్ కే నరేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడారు. పురపాలక సంఘం పరిధిలో ఆస్థి పన్ను 50శాతం రాయితీ ఇవ్వాలని ఎమ్మెల్యే వినతిపత్రంపై నిర్ణయం తీసుకునేందుకు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఇతర మున్సిపాలిటీల్లో కంటే ఇక్కడే ఆస్థి పన్ను ఎక్కువగా ఉందని ప్రజల నుంచి వ్యతిరేకత వస్తున్నందున తగ్గించాలని తీర్మానం చేసి